

పిజిఆర్‌ఎస్‌లో 571 అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాల్లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 571 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఎన్‌వివి.సత్యనారాయణ, జిజిహెచ్ ఎఒ ఎన్.శ్రీధర్, ఎస్‌ఎస్‌ఎ ఎపిఒ పి.వేణుగోపాలరావు అధికారుల బృందం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ వేదిక కార్యక్రమానికి రాలేని అర్జీదారులు తమ అర్జీలను Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని, అర్జీదార్లు వారి అర్జీల స్థితి తెలుసుకోవడానికి 1100 నెంబరుకి నేరుగా ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

అమలు కాని అమృత్ 2.0 పథకం

- అమలుపై నీలినీడలు
- వేధిస్తున్న తాగునీరు, మురుగు సమస్య
- నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ స్మార్ట్ సిటీతో పాటు జిల్లాలో ఉన్న అన్ని మున్సిపాలిటీలూ నగర పంచాయతీల్లో అమృత్ 2.0 పథకం పనులు ముందుకు సాగడం లేదు. అదుగో ఇదిగో అంటూ ప్రభుత్వాలు ఊరిస్తూనే ఉన్నాయి. దీంతో పట్టణాల్లో మురుగునీరు, తాగునీటి సమస్యలు ప్రజలను వేధిస్తూనే ఉన్నాయి. ఆయా పట్టణ ప్రాంతాల్లో మురుగు నీటిని శుద్ధిచేసి నీటి, వాయు కాలుష్యం లేకుండా చేయాలని కేంద్రం అమృత్ పథకాన్ని తీసుకొచ్చింది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో మురుగునీటి సమస్య పట్టణ వాసులకు పెద్ద సమస్యగా మారింది. ఈ పథకంలో భాగంగా 2016-20 మధ్య కాలంలో కాకినాడ నగర పాలక సంస్థ, మున్సిపల్ కేంద్రాల్లో మురుగు నీటి శుద్ధి ప్లాంట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. దీనిలో భాగంగా స్థానిక సంస్థలు 50 శాతం నిధులు, కేంద్రం 30 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం నిధులతో వీటిని నిర్మించాల్సి ఉంది.

పనుల్లో కానరాని కదలిక

జిల్లాలో అన్ని పట్టణాల్లో 8.13 లక్షల జనాభా ఉంది.అన్ని పట్టణాల్లో 117 ఎంఎల్‌డిల తాగునీటి అవసరాలున్నాయి. ఇప్పుడున్న జనాభాకు అవసరమైన తాగునీరు పూర్తిస్థాయిలో సరఫరా కావడం లేదు. మరోవైపు మురుగునీటి కాలువల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మురుగునీటి వల్ల రోగాలతో సతమతం అవుతున్నారు. వర్షం వస్తే తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. సరైన ప్రణాళికలు లేకపోవడంతో ఈ సమస్య పట్టణ వాసులను నిత్యం వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో ఈ పథకాన్ని తీసుకొచ్చి అమలు చేయాలని చూస్తున్నారు. గత ప్రభుత్వం తన వాటాను ఇవ్వకపోవడంతో ఈ పనులు జిల్లాలో అన్ని ప్రాంతాల్లోనూ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మిగిలిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అయినా ఈ పనులు మొదలవుతాయని అంతా ఆశిస్తున్నప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావస్తున్నా ఈ పనులకు సంబంధించిన అంశం ముందుకు రాలేదు.

ఏళ్ల తరబడి ఎదురు చూపులు

సిటీలో నిత్యం 50 మిలియన్ లీటర్ల వ్యర్థ జలాలు వద్ది చెందుతున్నాయి. వీటిని శుద్ధి చేయకుండానే సముద్రంలోకి నేరుగా వదిలేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏటిమొగ వద్ద 5 ఎంఎల్‌డిల సామర్థ్యంతో ఏడేళ్ల ఏళ్ల క్రితం నిర్మాణం చేపట్టారు. నేటికీ పూర్తి కాలేదు. ఇప్పటి వరకు 60 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు చెప్పుకొస్తున్నారు. ఇది పూర్తి కావడానికి మరో రెండేళ్ళ సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం నగర వ్యాప్తంగా మురుగు నీరు ఉప్పు టేరు నుంచి సముద్ర తీరానికి చేరుతోంది. మురుగు శుద్ధి లేని ప్రవాహం వల్ల అనారోగ్యాలు, చర్మ వ్యాధులు వస్తున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ప్రకారం పర్యావరణ పరిరక్షణ కోసం జనాభాకు తగిన చెట్లు, మురుగు శుద్ధి ఉండాలని చెబుతున్నా అధికారులకు పట్టడం లేదు. మరోవైపు ఏలేరు ప్రాజెక్టు నుంచి 45 కిలోమీటర్ల దూరంలో సామర్లకోటలోని సాంబమూర్తి జలాశయానికి పైపులైన్ల ద్వారా నీరు తరలించాలి. అక్కడి నుంచి 63 కిలోమీటర్ల మేర పంపిణీ చేయాలి. 19,535 ఇళ్లకు నీటి కనెక్షన్లు ఇవ్వాలి. 1500 కనెక్షన్లకు 24 గంటలూ నీటి సరఫరా చేయాల్సి ఉంది. స్మార్ట్ సిటీ పరిధిలోని 6 తాగునీటి పథకాలను అనుసంధానం చేయాలి. అమృత్ 2.0 పథకంలో భాగంగా కాకినాడ స్మార్ట్ సిటీకి రూ.256.48 కోట్లు నిధులు మంజూరైనా పనులు మొదలు కావడానికి అనేక ఆటంకాలు ఏర్పడుతున్నాయి.


పిఠాపురంలో మురుగునీటి శుద్ధి కేంద్రానికి ప్రతిపాదించిన స్థలం

మున్సిపాలిటీల్లో ఇదీ పరిస్థితి

పిఠాపురం పురపాలక సంఘంలో డ్రైవర్స్ కాలనీలో 1 ఎంఎల్‌డి, అగ్రహారంలో 1.1 ఎంఎల్‌డి సామర్థ్యంతో శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపారు. మూడేళ్ల క్రితమే రెండుచోట్లా 40 సెంట్ల చొప్పున స్థలం కేటాయించారు. నేటికీ ఈ పనులు ప్రారంభం కాలేదు. పిఠాపురం, తుని మున్సిపాలిటీల్లో తాగునీటి పథకాలను మెరుగుపరచడం, ఇంటింటికీ కుళాయిలు, కాలువలు ఏర్పాటు చేయడం కోసం రూ.72.37 కోట్లు మంజూరయ్యాయి. కానీ పనులు మొదలు కాలేదు. సామర్లకోట మున్సిపాలిటీలో తాగునీటి పథకాల మెరుగుదలకు ఇతర పనులకు సుమారు రూ.39 కోట్లు మంజూరయ్యాయి. పెద్దాపురానికి రూ.36.21 కోట్లు మంజూరైనా పథకం పనులు ప్రారంభం కాలేదు. గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీల్లో రూ.119 కోట్ల ఎఐఐబి రుణం మంజూరు చేశారు. ఈ నిధులతో మురుగునీటి కాలువల అభివృద్ధి, తాగునీటి పంపింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఈ పనులు ఎప్పటికి మొదలవుతాయనేది ఇంకా స్పష్టత లేదు.

సమస్యకు పరిష్కారం చూపాలి



కాకినాడ నగరంలో జనాభా అంతకంతకూ పెరుగుతోంది. వారి అవసరాలకు తగ్గట్టు తాగునీరు పూర్తిగా అందని పరిస్థితి ఉంది. ముంపు నగరంగా మారిన కాకినాడలో మురుగు శుద్ధి కేంద్రాలు తక్షణమే ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ నిధులను కేటాయించి తక్షణమే పనులను మొదలు పెట్టాలి. ఇప్పటికే నగరం వర్షాకాలంలో తీవ్ర ముంపు సమస్యను ఎదుర్కొంటున్న నేపథ్యంలో నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- పలివెల వీరబాబు, సిపిఎం నగర కన్వీనర్.



ఆందోళన చేస్తున్న జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్

జిజిహెచ్‌లో శానిటేషన్ వర్కర్స్ ఆందోళన

ప్రజాశక్తి-కాకినాడ

పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, నూతన కాంట్రాక్టు సంస్థ కార్మికులతో వేతన ఒప్పందం చేసుకోవాలని జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ చేపట్టిన ఆందోళన సోమవారం కొనసాగింది. సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ, భాగ్యవతి మాట్లాడుతూ రెండేళ్లుగా శానిటేషన్ వర్కర్స్‌కు పిఎఫ్, ఇఎస్ఐ కాక రూ.13,500 జీతం చేతికి అందుతోందన్నారు. ఇటీవల కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతూనే ఉన్నాయన్నారు. కాంట్రాక్టర్స్ సానుకూలంగా స్పందించాలని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిజిహెచ్ అధికారులు జోక్యం చేసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అంనంతరం ప్రదర్శన నిర్వహించారు. బి.మంగతాయారు, వెంకటలక్ష్మి, యూనియన్ గౌరవాధ్యక్షుడు పలివెల వీరబాబు, ఆర్.రమేష్, ఎస్.వాసు, ఎం.రవి, బి.కృష్ణవేణి పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు తెలపాలి

ప్రజాశక్తి-కాకినాడ

నగర ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వాటిని వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఇన్‌ఛార్జి కమిషనర్ కెటి.సుధాకర్ తెలిపారు. నగర ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు ఎప్పటికప్పుడు నీటి సాంద్రతను పరీక్షిస్తారని తెలిపారు. సోమవారం రామారావుపేటలోని కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాను ఆయన పరిశీలించారు. తాగునీటి సాంద్రతను ల్యాబ్‌లోనే పరీక్షించి, అనంతరం విక్టోరియా వాటర్ వర్క్స్‌ను సందర్శించారు. 12వ, 14వ సర్కిల్ పరిధిలోని కరణం గారి సెంటర్, ఒంటిమామిడి సెంటర్ ప్రాంతాల్లో శుభ్రతా పనులను పరిశీలించారు. ఒంటిమామిడి జంక్షన్ వద్ద హోటల్ యజమానులు, అపార్ట్‌మెంట్ వాసులు చెత్తను రోడ్డు మీద వేస్తున్నారని కార్మికులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. రోడ్డుపై వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.


తాగునీటి సాంద్రతను పరిశీలిస్తున్న సుధాకర్

విద్యార్థినికి సుగర్ ఉందని సీటు తిరస్కరణ

ప్రజాశక్తి-కాకినాడ

పెద్దాపురంలోని నవోదయ విద్యాలయలో 8వ తరగతి సీటు పొందిన విద్యార్థికి సుగర్ వ్యాధి అని తెలియడంతో యాజమాన్యం సీటును తిరస్కరించడంపై విద్యార్థి తల్లిదండ్రులు సోమవారం కలెక్టరేట్‌లో పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. పది రోజుల క్రితం పెద్దాపురంలో ఉన్న నవోదయ విద్యాలయలో 8వ తరగతిలో విద్యార్థి ప్రవేశం పొందింది. తొలుత విద్యార్థిని చేర్చుకున్నారు. అనంతరం సుగర్ ఉందని కేటాయించిన సీటును రద్దు చేశారు. విద్యార్థిని తీసుకుపోవాలని కరాకండిగా చెప్పారని వారు వాపోయారు. తాము పేదవారమని బతిమాలినా సీటు ఇచ్చేందుకు దయ చూపలేదన్నారు.



ఎపిడి వసంత మాధవికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

సమస్యలపై పిజిఆర్‌ఎస్‌లో సిపిఎం వినతి

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక పాడా కార్యాలయంలో పిజిఆర్‌ఎస్‌లో పాడా ఎపిడి వసంత మాధవికి సిపిఎం నాయకులు వినతిపత్రాలు అందజేశారు. జిల్లా నాయకులు డిఎస్.బాబ్జి, మండల కన్వీనర్ కుంచే చిన్న మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఇరిగేషన్ సంబంధించిన చెరుకుల కాలువ మీద షెడ్డు నిర్మించారని, సంబంధిత అధికారులు చూసి ఆక్రమణ జరిగితే చర్యలు తీసుకోవాలన్నారు. కూరగాయల మార్కెట్లో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో నిర్మిస్తున్న డ్రైనేజీ నాణ్యత ఉండటం లేదని, సగం వరకు మాత్రమే నిర్మించి మిగతా డ్రైనేజీ నిర్మించకపోవడంతో మురికి నీరంతా వెళ్లే దారిలో నిలిచిపోయి ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోనేటి రాజు, కె.నాగేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా వైసిపిని బలోపేతం చేయాలని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని పేరవరంలో సర్పంచ్ బేరి అరవింద్ కుమార్ నివాసంలో ఆయన మాట్లాడారు. తుపాన్ నేపథ్యంలో నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందే వరకు కార్యకర్తలు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని, ప్రజల కష్టాలను తమ కష్టాలుగా కష్టాలుగా భావించి భావించి పరిష్కారాన్ని కృషి చేయాన్నారు. ఆయన వెంట మాజీ ఎంపిపి గొల్లపల్లి కాశీ విశ్వనాథ్ కార్యకర్తలు ఉన్నారు.


ఆహారం వడ్డిస్తున్న టిడిపి నాయకులు

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సోమవారం అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. డాక్టర్ గోలి సత్య కృష్ణ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సూర్యకుమారి ఆర్థిక సాయం అందించారు. టిడిపి నాయకులు పాల్గొని పేదలకు ఆహారం వడ్డించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్‌విఎస్ అప్పలరాజు, టిడిపి నాయకులు జీను మణిబాబు, దేవరపల్లిమూర్తి, పాలచర్ల నాగేంద్ర చౌదరి, పాండ్రంగి రాంబాబు, సిద్ధ రామ్ పవన్ కుమార్, మండపాక అప్పన్న దొర పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు భేష్

ప్రజాశక్తి -తాళ్లరేవు

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ముమ్మిడివరం ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు అన్నారు. జెల్లవారి పేటలో పేదకుటుంబానికి చెందిన నేరేడుమిల్లి ఏడుకొండలకు లయన్స్ క్లబ్ నిర్మించిన నూతన గృహాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కొప్పిశెట్టి లక్ష్మయ్య భోజన క్యారేజీని ఏడుకొండలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ పేరయ్యరాజు, కార్యదర్శి పి.నరేందర్ రెడ్డి, నున్న దత్తు, నడింపల్లి వినోద్, బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, భగవాన్, చోడే శ్రీనివాస్, ధూళిపూడి బాబీ, నాయకులు వాసంశెట్టి శ్రీనివాస్, వాకపల్లి చిరంజీవి, కుడుపూడి దుర్గాప్రసాద్, విజయ్, చిట్టిబాబు, గోవిందు, పితాని హేమలత, రమేశ్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందించిన వారికి సత్కారం

ప్రజాశక్తి-కోటనందూరు

తుపానులో విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసిన కొత్తపెనుమండ్లపురం పంచాయతీ కార్యదర్శి ఎం.వీరలక్ష్మి సిఎం చంద్రబాబు ద్వారా ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. సోమవారం తుని ఎంపిపి బొప్పన రాము, తుని, తొండంగి మండలాల ఎంపిడిఒలు కె.సాయి నవీన్, సిబ్బంది వీరలక్ష్మిని ఘనంగా సన్మానించారు.

శిక్షణతో నైపుణ్యం ద్వారా ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి - సామర్లకోట

ఉద్యోగ నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారా శిక్షణలను సద్వినియోగం చేసుకుని ప్రమోషన్స్ పొందేందుకు అవకాశం ఉందని, ఆయా పోస్టులకు అవసరమైన నైపుణ్యాలు మెరుగు పర్చుకోవాలని సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ కెఎన్‌వి.ప్రసాదరావు పిలుపునిచ్చారు. శిక్షణా కేంద్రంలోగ్యాటీ ఎంపిడిఒలకు రెండు రోజులు శిక్షణ తరగతులు, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టులకు ఆరు రోజుల శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రసాదరావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో కీలకమైన పంచాయతీరాజ్ శాఖలో భాగస్వాములు అందరికీ ప్రభుత్వం దశల వారీగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జి.రమణ, డిడిఒ డి.శ్రీనివాసరావు, ఎంపిడిఒ శర్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.


పారంభ సభలో ప్రసంగిస్తున్న ప్రిన్సిపల్ ప్రసాదరావు

కాశీబుగ్గ ఘటనపై కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - సామర్లకోట, ఏలేశ్వరం

కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాటకు కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యమే ప్రధాన కారణమని వైసిపి పెద్దాపురం నియోజవర్గం ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు ఆరోపించారు. మృతి చెందిన వారి కోసం పాగా సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు ఊబా జాన్ మోజెస్, నెక్కంటి సాయి ప్రసాద్, ఆవాల లక్ష్మీనారాయణ, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఇరుసుమళ్ళ సాయి, సేపేని రూప సురేష్, పాలికి కుసుమ చంటిబాబు, తలారి దొరబాబు, నాయకులు రెడ్నం దొరబాబు, కరణం రాజ్‌కుమార్, లింగం శివప్రసాద్, మోరంపూడి రంగనాయకులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాటకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని వైసిపి ప్రత్తిపాడు ఇన్‌ఛార్జి ముద్రగడ గిరిబాబు అన్నారు. సిరిపురంలో సోమవారం ఆయన కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ఎంపిటిసి ఇజనగిరి ప్రసాద్, శెట్టి బుజ్జి, గొల్లపల్లి కాశి పాల్గొన్నారు.



సామర్లకోటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

5న టెన్నిస్ జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-పెద్దాపురం

స్థానిక రామారావుపేటలోని శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్ శ్రీప్రకాష్ సినర్జీ టేబుల్ టెన్నిస్ అకాడమీలో ఈ నెల 5న టేబుల్ టెన్నిస్ కాకినాడ జిల్లా క్రీడాకారుల ఎంపిక చేస్తారని జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.విజయ్ ప్రకాష్, మోహన్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మెన్, ఉమెన్ అండర్ 15 విభాగాల్లో ఈ ఎంపిక జరుగుతుందన్నారు. జిల్లాలోని టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని కాట్రావులపల్లిలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా చేపట్టిన పలు సేవా కార్యక్రమాలను సోమవారం ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రు ప్రారంభించారు. గ్రామ టిడిపి అధ్యక్షులు ముసిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద ప్రతి గురువారం అన్నదానం నిర్వహించడానికి ఫౌండేషన్ సాయంతో షెడ్డు, మరుగుదొడ్లను నిర్మించారు. పి4 పథకంలో క్యాన్సర్ బారిన పడిన అనాథ దంపతులకు షెడ్డు నిర్మించారు. వాటిని ఎంఎల్‌ఎ నెహ్రూ ప్రారంభించారు. అనంతరం కనకదుర్గ ఆలయానికి స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంఎల్‌ఎ నెహ్రూ మాట్లాడుతూ ఈ గ్రామానికి అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, జీను మణిబాబు, పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, సుంకర సీతారామయ్య, కంటే రామారావు, బిక్కిన బాబి, పిలా మహేష్, పోలినాటి ధర్మానందకుమారి, ఎల్లాటి అమ్మాజీ పాల్గొన్నారు.


షెడ్డును ప్రారంభించిన ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ

కరువు భత్యం తక్షణమే ప్రకటించాలి

ప్రజాశక్తి-కాకినాడ

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కరువు భత్యం ప్రకటించాలని సిఐటియు కాకినాడ నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్లు పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులను ఐక్యం చేసి ఆందోళనకు సిద్ధపడతామని హెచ్చరించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కరువు భత్యం పెంచకపోవడం కార్మికులకు అన్యాయం చేసి, యాజమాన్యాలకు లాభం చేకూర్చడమే ఈ ప్రభుత్వ యొక్క ఉద్దేశమని దీనిని మార్చుకోవాలన్నారు.


రేషన్ డిపో వద్ద ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

రేషన్ పంపిణీలో వ్యత్యాసంపై ధర్నా

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

తుపాను సమయంలో నష్టపోయిన తీర ప్రాంత వాసులకు కులాల వారీగా విభజించి రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారని పలువురు మూలపేట రేషన్ షాప్‌ల వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. కొంతమందికి 50 కేజీలు అందిస్తుండగా ఎస్‌సి, బిసిలకు 25 కేజీల బియ్యం అందిస్తున్నారని తెలిపారు. పునరావస కేంద్రాల్లో కులాలతో సంబంధం లేకుండా తరలించారని, ఉచిత రేషన్ కూడా వ్యత్యాసం లేకుండా అందించాలని కోరారు. కాకాడ లాజర్, వీరబాబు, రవికుమార్, సవరం వీరబాబు, సుబ్బారావు, రాజు, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సిహెచ్‌సిలో అవమానించారని ఆవేదన

ప్రజాశక్తి- తాళ్లరేవు

సిహెచ్‌సిలో తమను అవమానించారని సిహెచ్‌సి డైరక్టర్ వాకపల్లి సరోజినీదేవి ఆరోపించారు. ఆసుపత్రి వద్ద సోమవారం తన భర్త వాకపల్లి చిరంజీవి, టిడిపి నాయకులు దాసరి వేణుగోపాల్‌తో కలిసి ఆమె విలేఖరులతో మాట్లాడారు. ఆరోగ్య పరీక్షల కోసం ఆసుపత్రికి వచ్చిన తనను డైరక్టర్లు వినియోగించుకుంటున్న గది నుంచి సెక్యూరిటీ సిబ్బందితో బయటికి పంపించి గదికి తాళం వేసి సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత అవమానించారని తెలిపారు. దీనిపై సూపరింటెండెంట్ సునీత స్పందిస్తూ తాను ఎవరినీ అవమానించలేదన్నారు. అభివృద్ధి కమిటీకి ప్రత్యేకంగా గది లేదని, అందులో బ్లడ్ బ్యాంక్ ఉన్నందున తాళం వేసినట్టు తెలిపారు.

హాస్టల్స్‌లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పెద్దాపురం

పట్టణంలోని ఎస్‌సి బాలికల సంక్షేమ హాస్టల్, కళాశాల బాలుర సంక్షేమ హాస్టల్, దివిలిలోని సంక్షేమ హాస్టల్ మూడేళ్లుగా శిథిలావస్థలో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో దరఖాస్తు అందజేశారు. హాస్టల్స్‌లో విద్యార్థులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారన్నారు. ఈ భవనం స్లాబ్ పెచ్చులు పెచ్చులుగా ఊడిపోతోందన్నారు.

ఉపాధి వేతనాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

కాకినాడ జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ఉపాధి హామీ కార్మికులకు చెల్లించాల్సిన బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మూడు నుంచి నాలుగు వారాలపాటు ఉన్న బకాయి వేతనాలకు కేంద్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించాలన్నారు. ఉపాధి హామీ పనులను గుర్తించి, కూలీలకు పనులు కల్పించాలని, మేట్స్‌కు పారితోషకం, మొబైల్ ఫోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

బాలిక అదృశ్యం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మండలంలోని అన్నంపల్లి పంచాయతీ పరిధిలోని చింతపల్లిలంక గ్రామానికి 17 ఏళ్ల బాలిక అదృశ్యమైంది. ఈ మేరకు బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం..గుడికి వెళ్ళి వస్తానని ఈ నెల ఒకటో తేదీన సదరు బాలిక ఇంటి దగ్గర చెప్పి బయటకు వెళ్లింది. నాటి నుంచి ఆమె తిరిగి రాకపోవడంతో బంధువులు, బాలిక స్నేహితుల ఇళ్ల వద్ద గాలించారు. అయినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆ బాలిక ఆచూకీ తెలిసిన వారు సెల్ నెంబర్లు 94407 96564, 94407 96528, 89852 54749లకు సమాచారం అందించాలని కోరారు.


విజిలెన్స్ అధికారులు దాడిలో పట్టుబడిన అక్రమ బియ్యం

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - రావులపాలెం

స్థానిక డిగ్రీ కళాశాల సమీపంలోని జాతీయ రహదారిపై విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ టి.నాగరాజు నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా టాటా ఏసి వాహనంలో తరలిస్తున్న 4,600 కిలోల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించారు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం పెనుమాదం నుంచి జొన్నాడ వైపు 4,600 కిలోల బియ్యాన్ని తరలిస్తున్న జక్కంశెట్టి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బియ్యాన్ని వేములపల్లి ఎంఎల్ఎస్ పాయింట్ గొడౌన్‌కు అప్పగించారు. విజిలెన్స్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.చంటి తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు వెంకటరాజు, ఎజి లక్ష్మీనారాయణ, ఎంఎస్ఒ పి.వెంకటేశ్వరరావు, సిబ్బంది లోవరాజు, వల్లీ పాల్గొన్నారు.

రెండు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండలం ముగ్గళ్ళ గ్రామంలో రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. ఇనుగంటి వారి పేట నుంచి కోరుకొండ తరలిస్తున్న ఈ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని కోరుకొండ పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ నాగలక్ష్మికి సమాచారం అందించారు. నాగలక్ష్మి ఈ వాహనాన్ని సీజ్ చేశారు. 6ఎ కేసు నమోదు చేశారు. కోరుకొండ మండలం కాపవరం గ్రామానికి చెందిన తలారి వీరబాబు, మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా, నిల్వలు ఉంటే వెంటనే జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సమాచారం ఇవ్వాలన్నారు.

గుర్తు తెలీని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - అంబాజీపేట

వాకలగరువు పుష్కరాల రేవులోకి కొట్టుకు వచ్చిన గుర్తు తెలియని మృతదేహాన్ని సోమవారం సాయంత్రం స్థానికులు గుర్తించారు. అంబాజీపేట ఎస్ఐ కె.చిరంజీవికి సమాచారం అందించగా సంఘటనా స్థలానికి వెళుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో విద్యుత్ వైర్లు దగ్ధం

ప్రజాశక్తి - కొత్తపేట

స్థానిక కౌశిక రోడ్డులో జరిగిన అగ్నిప్రమాదంలో విద్యుత్ వైర్లు దహనం అయ్యాయి. సోమవారం విద్యుత్ స్తంభం పక్కన ఉన్న చెత్త కుప్పకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో విద్యుత్ స్తంభానికి వేలాడుతున్న వైర్లకు మంటలు వ్యాపించాయి. పెద్దఎత్తున పొగ, మంటలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో విద్యుత్ శాఖ ఎఇ ఎస్.రామకృష్ణ అప్రమత్తమై ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం వెళ్లడంతో హుటాహుటీనా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. విద్యుత్, అగ్నిమాపక శాఖ అధికారులు సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది.

చోరీ కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - తాళ్లపూడి

చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. గజ్జరం గ్రామానికి చెందిన గన్నిన నరసమాంబ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అపరిచిత వ్యక్తులు వచ్చారు. టివి రిపేరు ఉందని కంప్లైంట్ వచ్చిందని, దాన్ని రిపేరు చేయడానికి వచ్చామని నమ్మబలికారు. టివి బాగానే ఉందని ఆమె బదులిచ్చింది. 'మీ ఇంటికి వచ్చినట్టుగా టివి పక్కన ఫోటో తీసుకోవాలి' అని నిందితులు తెలిపారు. దీంతో వ్యక్తి లోపలికి ప్రవేశించాడు. ఇదే సమయంలో మరికొంత మంది లోనికి వచ్చి ఆమె బెడలో బంగారు గొలుసు లాక్కుని బ్లూ కలర్ మోటార్ బైక్‌పై పారిపోయారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కొవ్వూరు డిఎస్‌పి ఆదేశాలతో కొవ్వూరు రూరల్ ఎస్ఐ విజయబాబు పర్యవేక్షణలో కొవ్వూరు క్రైమ్ స్టేషన్ ఎస్ఐ రవీంద్ర, తాళ్లపూడి ట్రైనీ ఎస్ఐ ఆదిత్య శ్రీనివాస్ దర్యాప్తు చేపట్టారు. సోమవారం మండలంలోని బల్లిపాడు గ్రామం వద్ద దొంగలించిన బంగారం, పారిపోయిన మోటార్ బైకుతో షేక్ సుభానిజానీ, దేశగిరి గంగరాజు, వడ్డీ శరన్‌రాజు గుర్తించి పట్టుకున్నారు. వారిని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

హుండీల్లో నగదు చోరీ

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని మల్లవరం గ్రామంలో ఉమామల్లేశ్వరవు స్వామి ఆలయంలో హుండీల్లో నగదు చోరీకి గురైంది. ఆలయ కమిటీ సభ్యుల కథనం ప్రకారం ఉమామల్లేశ్వరవు స్వామి ఆలయంలోని మూడు హుండీలను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి సొమ్మును అపహరించారన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.


పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న సామర్లకోట రైతు నాయకులు

కాలువ గట్టు ఆక్రమణపై రీ సర్వేకు వినతి

ప్రజాశక్తి - సామర్లకోట


ప్రాచీన మాండవ్య నారాయణ స్వామి ఆలయం సమీపంలో ఇరిగేషన్‌కు చెందిన కాల్లగట్టు ఆక్రమణలపై రీ సర్వే నిర్వహించాలని రైతులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. రైతు నాయకుడు బిక్కిన శ్రీరంగనాయకులు, నేతల హరిబాబు, గ్రామ రైతులతో కలిసి సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా రంగనాయకులు మాట్లాడుతూ, నెల రోజుల క్రితం తాము ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అధికారులు సర్వే నిర్వహించినా, అది సరైన విధంగా చేయలేదన్నారు. నీటిపారుదల శాఖకు చెందిన సుమారు 60 సెంట్ల ప్రభుత్వ భూమిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి, కట్టడాలు నిర్మించి, బహిరంగ విక్రయాలు జరిపి లాభాలు ఆర్జిస్తున్నారని తెలిపారు. తక్షణమే అందరి సమక్షంలో పూర్తిస్థాయి విచారణతో రీ సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని ఆక్రమణల చెర నుండి రక్షించాలని డిమాండ్ చేశారు.


సాయం అందిస్తున్న మణికర్ణిక సభ్యులు, టిడిపి నేత

బాలుని వైద్యానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జగ్గంపేట, కిర్లంపూడి

కాలిన గాయాలతో బాధ పడుతున్న బాలుని వైద్యానికి మణికర్ణిక టీమ్ సహాయాన్ని అందించింది. కిర్లంపూడి మండలం బూరుగుపూడికి చెందిన ఐదేళ్ల సాయి దత్త కాలిన గాయాలతో బాధ పడుతున్నాడు. అతడికి మెరుగైన వైద్యానికి అయ్యే ఖర్చుల కోసం తల్లిదండ్రులు దాతల సహాయాన్ని కోరారు. విషయం తెలుసుకున్న మణికర్ణిక టీమ్ సభ్యులు దాతల నుండి రూ.60 వేలు సేకరించి టిడిపి నాయకులు పాటంశెట్టి రవి సమక్షంలో బాలుడి తల్లి వరలక్ష్మికి అందజేశారు. మణికర్ణిక సంఘం అధ్యక్షులు గున్నాబత్తుల పూజా అనూష, ఉపాధ్యక్షుడు మొగలంక శ్రీనివాస్, సభ్యులు స్వామి, రమేష్ పాల్గొన్నారు.


బాధితులకు చెక్కు అందిస్తున్న ఎంఎల్ఎ సుబ్బరాజు

బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి- తాళ్లరేవు

ఇటీవల కోరంగి వద్ద ఆటో ప్రమాదంలో మృతి చెందిన అరుబరుకుల లక్ష్మి కుటుంబానికి సొసైటీ నుంచి మంజూరైన రూ.2 లక్షల బీమా సొమ్మును సోమవారం మృతురాలు లక్ష్మి కుమారుడు రామ్‌జీకి ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు వాసంశెట్టి గోవిందు, ఏసూరి సత్తి రాంబాబు, టిడిపి మండల అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ, మందాల గంగ సూర్యనారాయణ, పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, కట్టా త్రిమూర్తులు, వినోద్, వెంటపల్లి ఉమామహేశ్వరి, కొప్పిశెట్టి చంటి, ఆనందరావు, సొసైటీ సిఇఒ గౌరీ శంకర్ పాల్గొన్నారు.


విచారణ చేస్తున్న అధికారులు

ఆసుపత్రిలో వ్యక్తి మృతిపై విచారణ

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని ప్రైవేటు ఆసుపత్రిలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ డి.ప్రశాంతి సోమవారం విచారణ చేపట్టారు. వైద్యుల నిర్లక్ష్యానికి ఒక వ్యక్తి మృతి చెందాడని పిజిఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసినట్టు ప్రశాంతి తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి నుంచి వివరాలు తీసుకున్నామని, శ్రీరామచంద్ర ఆసుపత్రి వైద్యులు ఫణి సుబ్రహ్మణ్యంను విచారించామన్నారు. ఆమె వెంట కాట్రావులపల్లి వైద్యులు ఎం.జయేష్ కుమార్, రాజపూడి ఎంపిహెచ్ఒ ఉమా మహేశ్వరరావు, వైద్య సిబ్బంది ఉన్నారు.



చెస్ పోటీల్లో గెలుపొందిన జ్యోతి జ్వాలశ్రీ

చెస్ పోటీలకు నారాయణ స్కూల్ విద్యార్థి

ప్రజాశక్తి - కాకినాడ

గాంధీనగర్ తిరుమల రావు వీధిలోని నారాయణ హైస్కూల్ విద్యార్థి చెస్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపల్, కరస్పాండెంట్ టివిఎస్.నారాయణ తెలిపారు. సోమవారం డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీల్లో మహిళల విభాగంలో జ్యోతి జ్వాలశ్రీ రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. ఈ నెల 7, 8 ,9 తేదీలలో శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు కాకినాడ జిల్లా జట్టు తరపున జ్యోతి జ్వాలశ్రీ పాల్గొంటుంది.

నీటి సంఘాలకు ప్రతి ఏడాదీ ఆదాయం

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

బాంబుసా తుల్డా అనే అరుదైన వెదురు జాతిని కెనాల్స్‌పై పెంచితే 40 ఏళ్ల వరకూ నీటి సంఘాలకు ఆదాయం వస్తుందని తూర్పు గోదావరి డెల్టా చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్, వైస్ చైర్మన్ తవలంపూడి సుధాకర్ రెడ్డి తెలిపారు. రాజమండ్రిలో ఎపి స్టేట్ ఫారెస్ట్ అకాడమీ డిఎఫ్ఒను మర్యాదపూర్వకంగా కలిసి ప్రాజెక్టులో భాగమైన కెనాల్ బండ్ ప్లాంటింగ్‌పై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిలు విజయ్ గోపాల రాజు, లాకాని కృష్ణ చైతన్య, పేపకాయల నారాయణరావు, సుబ్రహ్మణ్యేశ్వర చౌదరి పాల్గొన్నారు.

మినీ గూడ్స్ వెహికల్స్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మినీ గూడ్స్ వెహికల్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు పాల్గొన్నారు. గౌరవాధ్యక్షునిగా యాళ్ల వీరబాబు, అధ్యక్షునిగా పూసపాటి వాసు, కార్యదర్శిగా సిమ్మ నూకరాజు, కమిటీ సభ్యులుగా నెక్కల వెంకటేష్, కోమాటి శేషగిరి, గొర్రెల శ్రీనివాస్ ఎంపికయ్యారు. నూతన కమిటీ సభ్యులను ఎంఎల్ఎ చినరాజప్ప, రాజా సూరిబాబు రాజు అభినందించారు.

సామాజిక అవగాహన పెంపొందించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

దేశ భవిష్యత్తుకు వెన్నెముక అయిన యువతను సమీకరించి వారిలో సామాజిక అవగాహన పెంపొందించాలని డివైఎఫ్ఐ నాయకులు యాసలపు రమేష్ అన్నారు. డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక వరహాలయ్యపేటలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి రొంగల ఆనంద్, లక్ష్మణ్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా యువతను సమీకరించి వారిలో సామాజిక చైతన్యం కల్పించడంలో డివైఎఫ్ఐ ప్రముఖ పాత్ర వహించిందన్నారు. దేశ సమగ్రత, సమైక్యత, దేశభక్తి భావాలను పెంపొందించడంతోపాటు వారిని సామాజిక సమస్యలపై సమీకరించి పోరాటాలు నిర్వహించిందన్నారు. కళాకారులు రొంగల వీర్రాజు, దారపురెడ్డి కష్ణ, మహాపాతిన రాంబాబు, దారపురెడ్డి సత్యనారాయణ అభ్యుదయ గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో కూనిరెడ్డి అప్పన్న, నెక్కల నరసింహమూర్తి, సూరిబాబు, అరుణ్ పాల్గొన్నారు.

చేనేతకు ఉచిత విద్యుత్ హామీ నెరవేర్చాలి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

కూటమి ప్రభుత్వం చేనేత మగ్గాలకు కల్పిస్తామన్న ఉచిత విద్యుత్ హామీని నెరవేర్చాలని కోరుతూ సోమవారం మండలంలోని చేబ్రోలు గ్రామానికి చెందిన ఎపి పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ, బేతా మణికంఠ పిఠాపురం పాడా కార్యాలయంలో ఎపిడి వసంత మాధవికి వినతిపత్రం అందజేశారు. జయకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేనేత కుటుంబాలకు సాధారణ మగ్గాలు ఉన్నవారికి 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్లకు ఉచిత విద్యుత్తు అందిస్తామని హామీ ఇచ్చి 18 నెలలు కావస్తున్నా హామీని నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా హామీలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేలేటి రాజేష్, బండారు మణికంఠ పాల్గొన్నారు.

సఖి సురక్ష ద్వారా వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మెప్మా ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ సెంటర్‌లోని అంబేద్కర్ భవనంలో సోమవారం మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంఎలఎ నిమ్మకాయల చినరాజప్ప, ఆయన తనయుడు రంగనాగ్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెప్మా సిఎంఎం జి.భ్రమరాంబ మాట్లాడారు. 35 ఏళ్ల వయసు పైబడిన స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఈ పథకం ద్వారా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణ, మహిళల సురక్షిత జీవన విధానాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.


పోటీలను ప్రారంభిస్తున్న రంగనాగ్, సూరిబాబు రాజు

ఎంఆర్ కాలేజిలో ఆటల పోటీలు

ప్రజాశక్తి-పెద్దాపురం

స్థానిక మహారాణి కళాశాలలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను నిమ్మకాయల రంగనాగ్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు ప్రారంభించారు. ఈ క్రీడా పోటీల ప్రారంభ సభలో వారు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండి విద్యార్థులను క్రీడా పోటీల్లో ప్రోత్సహించాలన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శరీర ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం సిద్ధిస్తుందన్నారు. డివిజన్ కోఆర్డినేటర్ కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అండర్ 14, అండర్ 17 విభాగాలలో బాల బాలికలకు కబడ్డీ, బాస్కెట్‌బాల్, కోకో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో 11 మండలాల నుంచి 750 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీడీలు వరసాధనం, సుబ్బారావు, కె.శ్రీనివాస్, వీరబాబు, విశ్వేశ్వరరావు, లచ్చబాబు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-శంఖవరం

కార్తీకమాసంలో అన్నవరంలో గిరి ప్రదక్షిణ ప్రదేశాలను ఎస్‌పి బిందు మాధవ్ పరిశీలించారు. సోమవారం అన్నవరం వచ్చిన ఆయన ఇఒ సుబ్బారావు, పోలీస్ సిబ్బందితో కలిసి ఈ నెల 5న నిర్వహించే గిరి ప్రదక్షిణ రహదారిని పరిశీలించారు. ఆ రోజున భారీ వాహనాల ప్రవేశం నిషేధమని, యాత్రికుల రాకపోకల మార్గాలు స్పష్టంగా గుర్తించేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

50 వేల ఎకరాల్లో వరికి నష్టం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జిల్లాలో ఇటీవల తుపాను నేపథ్యంలో 50,840 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయకుమార్ తెలిపారు. పంట నష్టం అంచనాలు పూర్తయ్యాయని, నష్టపోయిన రైతుల జాబితాలను ఆయా సచివాలయాల్లో ప్రదర్శించామని తెలిపారు. 20 మండలాల పరిధిలో 45,731 మంది రైతులపై తుపాను ప్రభావం చూపిందన్నారు. పెదపూడి మండలంలో 11,462 ఎకరాల్లో అత్యధిక నష్టం వాటిల్లిందన్నారు.

పలువురికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పిఠాపురం

మెప్మా ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవనంలో సఖి సురక్ష పథకంలో స్వయం సహాయక సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ వి.వినిత, డాక్టర్ కె.సురేందర్ వైద్య పరీక్షలు చేశారు. ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ రాజు ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. 35 సంవత్సరాలు పైబడిన స్వయం సహాయక గ్రూపు సభ్యులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు, ఆధునిక యంత్రాలతో ఇంటి వద్దనే హెల్త్ స్క్రీనింగ్, ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సిఫార్సులు చేస్తారన్నారు. 40 మంది సభ్యులకు పరీక్షలు నిర్వహించారని తెలిపారు.

పలువురికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - సామర్లకోట

ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప దత్తత గ్రామమైన హుస్సేన్‌పురంలో పి4లో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరం, దంత వైద్య శిబిరం నిర్వహించారు. జగ్గంపేట గౌతమీ నేత్రాలయం సహకారంతో వైద్యులు కంటి సమస్యలు కలిగిన వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేసారు. గ్రామ టిడిపి నాయకులు చల్లా బుజ్జి పాల్గొన్నారు.

వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరంలో వైసిపి శ్రేణులు సంతకాల సేకరణ చేపట్టారు. మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి కోటి సంతకాల సేకరణ నిర్వహిస్తుంది. దానిలో భాగంగా గ్రామస్తుల నుంచి సంతకాల సేకరణను పార్టీ మండల అధ్యక్షులు రావుల గణేష్ రాజా ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ నాయకులు గుర్రం మహాలక్ష్మి, రావుల స్వామి, మొగిలి శ్రీనివాస్, రావుల సురేష్ కుమార్, దొడ్డ సూరిబాబు పాల్గొన్నారు.

యానాం వార్తలు

నేటి నుంచి ఎలక్టోరల్ రోల్స్ నమోదు

ప్రజాశక్తి - యానాం



వివరాలు వెల్లడిస్తున్న ఆర్ఎఒ అంకిత్ కుమార్

యానాం నుంచి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఫోటో ఎలక్టోరల్ రోల్స్ నవంబర్ 4 నుంచి డిసెంబర్ 4వరకు నిర్వహిస్తున్నట్లు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, ఆర్ఎఒ అంకిత్ కుమార్ తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పెషల్ ఇంటెన్సివ్‌లో భాగంగా బూత్ లెవిల్ ఆఫీసర్లు ఇంటింటికీ వచ్చి గణన ఫారాలు అందజేస్తారన్నారు. ఇచ్చిన రెండు కాపీలను పుట్టిన తేదీ, ఫోన్ నెంబర్, ఆధార్ కార్డు నెంబర్,తల్లి తండ్రి లేదా భార్య పేరు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో వివరాలు నమోదు చేసి వాటిని మళ్ళీ బిఎల్ఒలకు అందజేయాలన్నారు. రెండో కాపీ తిరిగిస్తారన్నారు. బిఎల్ఒలు కనీసం రెండు మూడుసార్లు ఇంటిని సందర్శిస్తారని తెలిపారు. కొత్త ఓటర్లు ఫారం– నింపాలన్నారు. కుటుంబ సభ్యులు ఎవరైనా విద్య కోసం, ఇతర పనుల కోసం బయట ఉన్నట్లయితే వారి ఘనన పత్రాలను కుటుంబ సభ్యులు పూర్తి చేయవచ్చు అన్నారు.

చిక్కాలకు పొట్టి శ్రీరాములు సేవారత్న అవార్డు

ప్రజాశక్తి - యానాం

పాండిచ్చేరి తెలుగు సేన అధ్యక్షుడు, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ చిక్కాల నరసింహమూర్తి పొట్టి శ్రీరాములు విశిష్ట సేవారత్న అవార్డును అందుకున్నారు. సిరిసిరి మువ్వ అష్ట వింశతి 28వ వార్షికోత్సవం, ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం, పొట్టి శ్రీరాములు 125వ జయంతోత్సవం సందర్భంగా ఈ అవార్డులను ప్రకటించారు. తాడేపల్లిగూడెంలో సిరిమువ్వ సోషల్ సర్వీస్ అండ్ ఆర్ట్స్‌అసోసియేషన్, పొట్టి శ్రీరాములు అభ్యుదయ వేదిక సిరిమువ్వ ఫౌండర్, కన్వీనర్ సిరిమువ్వ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చిక్కాలకు ఆ సంస్థ ప్రతినిధులు, ఇతర ప్రముఖులు అవార్డును ప్రదానం చేశారు.

డిటిగా బాలాశ్రీ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - యానాం

యానాం డిప్యూటీ తహశీల్దారుగా యానాంకు చెందిన జువ్వల బాలాశ్రీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పుదుచ్చేరి ప్రభుత్వం బాలాశ్రీని యానాం డిటిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సోమవారం స్థానిక రెవిన్యూ కార్యాలయంలో ఉదయం డిటిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ ఉద్యోగులు, పలువురు అధికారులు, ప్రముఖులు బాలాశ్రీని శాలువాలతో సత్కరించి అభినందించారు.

ఢిల్లీలో పలువురిని కలిసిన మల్లాడి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఢిల్లీ పర్యటనలో భాగంగా సోమవారం పలువురిని మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా కేంద్ర క్రీడలు యువజన మంత్రిత్వశాఖ మంత్రి మునీష్ మాండవితో బేటీ అయ్యారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కు సంబంధించిన విషయాలు చర్చినట్లు తెలిపారు. ఖోఖక్క, కరాటే, తైక్వాండో, అథ్లెటిక్స్ విభాగాలు యానాం శాయ్‌లో ఏర్పాటు చేయాలని, వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ విభాగాల ఏర్పాటు, స్విమ్మింగ్ పూల్ గ్యాలరీ, డ్రెస్ ఛేంజింగ్ రూమ్స్, టాయిలెట్స్, ఫిట్నెస్ (జిమ్) తదితర వాటి అభివృద్ధికి ఖేలో ఇండియన్ నుంచి రూ.2.5 కోట్లు కేటాయించాలని కోరానన్నారు. మెట్టకూరు, దరియాలతిప్ప, సావిత్రి నగర్లలో క్రికెట్ గ్రౌండ్లకు రూ.మూడు కోట్ల కేటాయించాలన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక రాజు గారి కోటలో ఉన్న టిడిపి కార్యాలయంలో నియోజవర్గంలో మూడు మండలాలకు సంబంధించి సిఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ ఎంఎల్ఎ టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌విఎస్ఎన్.వర్మ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ నియోజకవర్గంలో 52 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.28 లక్షలు మంజూరు చేశారన్నారు. కుటుంబంలో ఒకరు అనారోగ్యం పాలయితే, కుటుంబం మొత్తం కలత చెందుతుందన్నారు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే ఉత్సాహంగా జీవించగలమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొజ్జా సతీష్, సకుమళ్ల గంగాధర్ రావు బి.అప్పారావు, బి.రాజు, కె.సూర్యప్రకాష్, సత్యానందరెడ్డి, పిల్లి చిన్న, అల్లవరపు నగేష్, రాయుడు శ్రీను పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-కాకినాడ


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిఐ రమేష్

ట్రాఫిక్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్, హెల్మెట్ వాడకం, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సిఐ ఎన్.రమేష్ మాట్లాడారు. బైకు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కుటుంబ సభ్యులకు కూడా ఈ విషయాన్ని తెలియజేయాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలపై హెచ్చరించారు. జీబ్రా లైన్ లేని ప్రదేశాల్లో రోడ్డు దాటేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఉపయోగాలను వివరించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణించరాదనీ, డ్రైవర్ పక్కన లేదా వెనుక భాగంలో కూర్చోరాదని విద్యార్థినులకు సూచించారు. బస్సుల ఫుట్‌పాత్ ప్రయాణం ప్రమాదకరమన్నారు. అత్యవసర సేవల నంబర్లు 112, 1930, 1972 వినియోగం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ కె.సురేష్ ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.


భీమేశ్వరాలయానికి పోటెత్తిన యాత్రికులు

భీమేశ్వరాలయానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట భీమేశ్వరాలయానికి సోమవారం యాత్రికులు అధిక సంఖ్యలో పోటెత్తారు. కార్తీక మాసం 2వ సోమవారం కావడంతో అధిక సంఖ్యలో యాత్రికులు వచ్చారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఆలయం వద్ద అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. భద్రతా ఏర్పాట్లను డిఎస్‌పి డి.శ్రీహరి రాజు, సిఐ జయ శంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అడపా గారగారావు పరిశీలించారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అన్ని ఏర్పాట్లూ చేసినట్టు ఆలయ కార్యనిర్వహనాధికారి బళ్ల నీలకంఠం, ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీశ్ మోహన్ తెలిపారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, అమలాపురం

I.A. 611/2022, I.A. 612/2022, I.A. 613/2022
F.D.A. No. 4/2021
O.S. No. 114/2016

Between:
నంద్యాల రామ్‌గోపాల్ **-పిటీషనర్**
అండ్
నంద్యాల వెంకటస్వామి వగైరాలు **-రెస్పాండెంట్స్**

Proposed 6th Respondent:
నంద్యాల రత్నం, W/o. late సత్యనారాయణమూర్తి, డో.నెం. 1-8/1, తాండవపల్లి గ్రామము, అమలాపురం మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

పై నెంబరు దావాలో మిమ్ములను Proposed LR గా జాయిన్ చేయుటకు వేసిన పిటీషన్స్‌లో మీ హాజరు నిమిత్తం వాయిదా **తేది. 13-11-2025 నాటికి కలదు.** సదరు తేదీన పై కోర్టులో **ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరై ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

అమలాపురం **కొమ్ముల వెంకట బుచ్చిరాజు**
30-10-2025 అడ్వకేట్, అమలాపురం

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
ఒ.ఎస్. నెం. 237/2025

బిట్వీన్:
సత్తి సత్యనారాయణరెడ్డి **-వాది**
మరియు
1) గీసాల శ్రీను
2) పిల్లి ముని **-ప్రతివాదులు**

టు:
1వ ప్రతివాది: గీసాల శ్రీను, తండ్రి: అర్జునరావు, డోర్ నెం. 3-31, నందరాడ, రాజమహేంద్రవరం జె.సి.జె.సి.

2వ ప్రతివాది: పిల్లి ముని, భర్త: నాగేశ్వరరావు, డోర్ నెం. 3-61, నందరాడ, రాజమహేంద్రవరం జె.సి.జె.సి.

పై నెంబరు ప్రతివాదులు ఎన్ని పర్యాయములు కోర్టు ద్వారా గాని, రిజిష్టర్ పోస్టు ద్వారా గాని నోటీసులు పంపినప్పటికి వారు సదరు నోటీసును పుచ్చుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. అందు నిమిత్తం శ్రీ కోర్టు వారు వారికి పేపరు పబ్లికేషన్ ద్వారా దావా సమనులు ప్రచురించవల్సిందిగా ఉత్తర్వులు జారీ చేసినారు. ఆ ప్రకారం సదరు ప్రతివాదులు **దివి. 14-11-2025వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల ప్రతివాదులను ఎక్స్‌పార్టీ చేసి వారి పరోక్షమందు సదరు దావా తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

పి.వి.వి.ఎస్.బి.రాజు
జి.సత్యనారాయణ
వాది తరుపున అడ్వకేట్స్, రాజమండ్రి

నోటీసు

మహారాజశ్రీ రామచంద్రపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడి వారి కోర్టులో
E.A. No. 119/2025 in
E.P. No. 39/2023 in
O.S. No. 205/2020

Between:
1. తాలాబత్తుల శాంతి ప్రకాష్‌కుమార్
2. తాలాబత్తుల మణికుమారి

-పిటీషనర్స్/ DHr's
AND
గంధం రాజు **-రెస్పాండెంట్/ JDr**

To:
గంధం రాజు, S/o. వీరన్న, 44 సం॥లు, వ్యాపారం, డోర్ నెం. 2-3-6, ఆదియాంధ్రపేట, కొత్తూరు, రామచంద్రపురం, రామచంద్రపురం మండలం, రామచంద్రపురం JCJC
-రెస్పాండెంట్/ JDr

పై నెంబరు EA 119/2025 కి సంబంధించి రెస్పాండెంట్/ JDr యొక్క అప్పియరెన్స్ నిమిత్తం **దివి. 07-11-2025 వాయిదాగా అయి ఉన్నది.** కాబట్టి మీరు **ఆరోజు ఉదయం 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ సంజాయిషీ దాఖలు చేసుకోవలెను. లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

వాయిదా తేది: 07-11-2025
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)
టి.వి.నారాయణరెడ్డి
ఎస్.రామ్మూర్తి
DHr తరపు అడ్వకేట్స్, అనపర్తి
సెల్: 9849484239